క్లుప్తంగా

రైతుల మోములో చిరునవ్వు



బుడ్డిపేటవద్ద కుడి కాలువలో ప్రవహిస్తున్న తోటపల్లి ప్రాజెక్ట్ నీరు

సీతానగరం: తోటపల్లి సాగునీటి ప్రాజెక్ట్ కుడి కాలువ ద్వారా నీరువిడుదల చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుడికాలువ పరిధిలోఉన్న గ్రామాల్లోని వర్షాధార భూములకు సాగునీరు ప్రవహించడంతో వర్షాధారం భూములున్న రైతులు ఈఏడాది ఖరీఫ్ పంటలకు ఢోకాలేదని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

• ఏఓ అనురాధ పండా



మాట్లాడుతున్న ఏఓ అనురాధ పండా

సాలూరు: ఖరీఫ్ వరి సాగు చేసే రైతులు విత్తనశుద్ధి చేయడం వల్ల నారుమడికి ఆశించే తెగుళ్లను నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి అనురాధ పండా అన్నారు. మండలంలోని మామిడిపల్లి రైతుభరోసా కేంద్రం వద్ద బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంటల్లో పురుగు మందుల వాడకం తగ్గించాలని సూచించారు. అధికంగా పురుగు మందులు వాడితే దిగుబడులు ఆరోగ్యానికి చేటు చేస్తాయని చెప్పారు. అనంతరం రైతులకు కంది విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ సంధ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి



పనులు పరిశీలిస్తున్న ఈఎన్‌సీ శ్రీనివాసరావు, తదితరులు

సాలూరు: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ ఈఎన్‌సీ శ్రీనివాసరావు ఆదేశించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో మండలంలోని దుక్కడవలస నుంచి మిర్తివలస వరకు జరుగుతున్న రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. 150 లక్షల రుపాయలతో 2.52 కిలోమీటర్ల మేర జరుగుతున్న బీటీ రోడ్డు పనులు వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట డీఈ మణిరాజ్, తదితరులు ఉన్నారు.

పోలమాంబ ఆలయ అభివృద్ధికి అంచనాలు



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఈ కేవీసీ కృష్ణ

మక్కువ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం శంబర పోలమాంబ అమ్మవారి చదురుగుడి, వనంగుడి ,పెద్దమ్మ తల్లి ఆలయాల వద్ద అభివృద్ధి పనులను కామన్ గుడ్ ఫండ్ ద్వారా చేపట్టేందుకు దేవదాయశాఖ డిప్యూటీ ఈఈ కేవీసీ కృష్ణ బుధవారం అంచనాలు తయారు చేశారు. ఈ మేరకు ఆలయ స్థలాలను పరిశీలించి మాస్టర్ ప్లాన్ నిమిత్తం సుమారు రూ. 8 కోట్లతో లైన్ ఎస్టిమేట్స్ తయారు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. కార్యక్రమంలో ఈఓ వి.రాధాకృష్ణ ,ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, ఉప సర్పంచ్ ఎ. వెంకటరమణ, మురళీ నాయుడు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా లెక్క...



సర్వే నంబర్ 341లో రోవర్‌తో రీ సర్వే చేపడుతున్న అధికారులు

పాలకొండ రూరల్: సమగ్ర భూ సర్వేలో భాగంగా కమర్షియల్, ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న భూముల లెక్క పక్కాగా చేపట్టేందుకు రోవర్ సాయంతో రీ సర్వే చేపట్టినట్లు తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. పాలకొండ - వీరఘట్టం రహదారిలో సర్వే నంబర్ 341లో కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియను డిప్యుటీ తహసీల్దార్ బి.బిచ్చయ్యతో కలసి గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ భూ యజమానుల సమక్షంలో చేపడుతున్న రీ సర్వే ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేదన్నారు. సాంకేతిక, యంత్ర సహాయంతో అవసరమగు చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. సమస్యలుంటే క్షక్షేత్ర స్థాయిలో అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పి.వెంకటరావు, వీఆర్వోలు బలివాడ సాయి శ్రీనివాస్, రామారావు, సహాయ సర్వేయర్లు జి.గణేష్, మణికుమార్, నాగరాజు పాల్గొన్నారు.

• ముఖ్యమంత్రికి స్వాగతం






అమ్మఒడి పథకం నాలుగో విడత నిధుల విడుదలకు బుధవారం పార్వతీపురం మన్యం జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు

ఘనంగా జగన్నాథుడి మారు రథయాత్ర



జగన్నాథుని ఉత్సవమూర్తుల ఊరేగింపు

మక్కువ: మండల కేంద్రంలో జగన్నాథుడి మారు రథయాత్ర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు రామలింగేశ్వర ఆలయం నుంచి జగన్నాథుని విగ్రహాలను ప్రధాన వీధుల్లో ఊరేగించారు. మహిళలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

వైద్యసేవలపై డిప్యూటీ సీఎం సంతృప్తి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

పార్వతీపురం: జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో వైద్య సేవలపై ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక వైద్యపరీక్షలను చేయించుకున్నారు. ఇటీవల ఆయన బైక్ ర్యాలీలో పాల్గొన్నప్పుడు జరిగిన ప్రమాదంలో కాలి బొటనవేలికి గాయం కావడంతో శస్త్రచికిత్స చేయించుకున్నారు. అలాగే కళ్లకు కూడా శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిని సందర్శించి కంటికి, కాలికి మరోసారి తనిఖీలు చేయించి వైద్యులు అందించిన చికిత్సపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో గతంలో కంటే ప్రస్తుత ప్రభుత్వం హయాంలో పలు రకాల వైద్యసేవలను అందిస్తూ ప్రతి పేదవాడి ఆరోగ్య రక్షణకు పూర్తి భరోసాను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కల్పిస్తున్నారన్నారు. ఆయనతోపాటు ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ బి. వాగ్దేవి తదితరులున్నారు.

జగన్నాథుని దర్శించుకున్న పీఠాధిపతి



రథయాత్రలో పాల్గొన్న పీఠాధిపతి గోస్వామి

భామిని: మండలంలోని బత్తిలిలో వెలసిన జగన్నాథ, బలబద్ర, సుభద్రలను భువనేశ్వర్‌కు చెందిన శ్రీరాధా బృందావన స్వామి మఠం పీఠాధిపతి మదనమోహన్ మహరాజ్ గోస్వామి బుధవారం దర్శించుకున్నారు. రథయాత్ర ముగింపు వేడుకల్లో పాల్గొని సాంప్రదాయంగా వింజామరాలతో మూల విరాట్‌లను సేవిస్తూ పూజలు చేశారు. గుడించా మందిరం నుంచి రథాన్ని తిరుగుముఖం పట్టే బహుదా యాత్రను చేపట్టారు. అనంతరం హరేరామ నామ సంకీర్తన బృందాలతో మృదంగాన్ని వాయిస్తూ సందడి చేశారు. ముందుగా పీఠాధిపతిని ఆలయ అర్చకులు అర్జున సాహు, సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ భానుప్రసాద్ సాహు, గ్రామ పెద్దలు స్వాగతం పలికారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి



సిబ్బందికి సూచనలిస్తున్న విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని ఆ శాఖ ఈఈ టీజీకే మూర్తి అన్నారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నేతృత్వంలో పాలకొండలో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో అవగాహనా ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు విద్యుత్ సంబంధిత పనులు, నిర్వహణ కార్యక్రమాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో వాటిని అమలు చేయటంతో పాటు ప్రజలు, రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. డీఈఈ ఎస్.మోహన్ చక్రవర్తి, ఏఈఈలు శ్యామ్‌సుందర్, బాలాజీ, అప్పన్న, జేఈ జి.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి కోసం ఆందోళన చెందొద్దు

రేగిడి: మడ్డువలస ప్రాజెక్ట్ ద్వారా ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు విడుదలపై రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఉనుకూరులో మీడియాతో మాట్లాడుతూ మడ్డువలస ప్రాజెక్ట్ షట్టర్ల మరమ్మతుల నిమిత్తం నీటిని విడిచిపెట్టారని, ప్రస్తుతం షట్టర్ల మరమ్మతులు పూర్తిచేశారని తెలిపారు. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రాజెక్ట్‌ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలోనే ప్రాజెక్ట్‌లోకి నీరు చేరుతుందని, కాలువల ద్వారా నీటిని విడిచిపెడతారని వివరించారు. ఇనాం భూములున్న రైతులు విత్తనాలు అందలేదని ఆందోళన చెందొద్దన్నారు.

ఇంటింటికీ జగనన్న సురక్ష సర్వే



వలంటీర్ల కోసం వచ్చిన జగనన్న సురక్ష పాకెట్ కార్డులను చూపిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్

సీతానగరం: జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చడానికి ఇంటింటికీ వచ్చి సర్వే నిర్వహిస్తున్న గ్రామ వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లకు అవసరమైన సమాచారం ఇచ్చి సహకరించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సర్వే చేస్తున్న గ్రామ వలంటీర్లకు జగనన్న సురక్ష పాకెట్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తున్నప్పటికీ సాంకేతిక పరమైన సమస్యలతో పథకాలు పొందలేకపోతున్న వారి వివరాలను సేకరించి తక్షణమే సమస్యలను పరిష్కరించడానికి సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణలో నిర్వహించే సర్వేలో పాల్గొనే వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు అవసరమైన సమాచారాన్ని గ్రామాల్లో కుటుంబసభ్యులు లేదా ఇంటియజమాని ఇవ్వాలని సూచించారు. అలాగే గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి వస్తున్న అధికారుల దృష్టికి తెచ్చి ప్రభుత్వ సచివాలయాల్లోనే పరిష్కరించుకోవాలని చెప్పారు.

తీరిన రహదారి కష్టాలు



పూర్తయిన చినంకలాం బీటీరోడ్డు



చినంకలాం జంక్షన్ నుంచి శివరాంపురం గ్రామానికి వేసిన బీటీరోడ్డు

• తారురోడ్లు వేయడంతో దూరమైన రాకపోకల యాతన

సీతానగరం: మండలంలోని పలుగ్రామాలకు అనుసంధానంగా ఉన్న మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలిగాయి. పార్వతీపురం నియోజక వర్గానికి చెందిన సీతానగరం-బలిజిపేట మండలాల ప్రజల రాకపోకలకు అనుకూలంగా ఉండేవిధంగా గ్రావెల్ రోడ్లను బీటీరోడ్లుగా అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో బొబ్బిలి నుంచి కలవరాయి సీతానగరం మండలం గాదెలవలస మీదుగా పణుకువలస వరకు ఉన్న బీటీరోడ్డును బలిజిపేట మండలం శివరాంపురం వరకూ మరో 620 మీటర్లు పెంచుతూ రూ.65 లక్షల వ్యయంతో బీటీరోడ్డు వేశారు. అలాగే పణుకువలస జంక్షన్ నుంచి సీతానగరం మండలం చినంకలాం గ్రామానికి గల1270 మీటర్ల మెటల్ రోడ్డును అభివృద్ధి చేస్తూ రూ.1.07 కోట్లతో బీటీరోడ్డు వేశారు. పులిగుమ్మి జంక్షన్ నుంచి రేపటివలసకు రూ1.20 కోట్లతో 1.8 కిమీ రోడ్డు పనులు పూర్తి కావస్తున్నాయి. ఈ మేరకు ఆయాగ్రామాలకు చెందిన నాయకులు బి.అప్పలనాయుడు,డి నరహరినాయుడు, ప్రజలు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు తొలిగిపోయాయని సంతోషం వెలిబుచ్చారు. తమ సమస్యలు పరిష్కరించిన జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు.

ముగిసిన జగన్నాథస్వామి ఉత్సవాలు



గుండిచా మందిరం వద్ద స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బలిజిపేట: జగన్నాథస్వామి రథోత్సవాలు బుధవారంతో ముగిశాయి. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గుండిచా మందిరం వద్ద తొమ్మిదవ రోజు స్వామివారిని అలంకరించారు. చివరిరోజు కావడంతో తెల్లవారు జామునుంచి వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గుడి ప్రాంగణంలో యాత్ర నిర్వహించారు. ఉదయం నుంచి భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. గుండిచా మందిరం వద్ద స్వామివారిని ఆరు రోజుల పాటు మత్స్య, కూర్మ, వామన, పరశురామ, రామ, కృష్ణ, కల్కి, బుద్ధ అవతారాలలో అలంకరించి పూజా కార్యక్రమాలు చేశారు. రాత్రి స్వామివారిని గుండిచా నుంచి తిరిగి వేంకటేశ్వర ఆలయం వద్దకు తీసుకువచ్చారు. యాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్‌శాఖ బందోబస్తు నిర్వహించింది.

ప్రకృతి వ్యవసాయమే మేలు



కూరగాయల విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్, ఏఏ, వెలుగు సిబ్బంది

భామిని: మండలంలోని పాలిష్ కోటలో ఆదివాసీ గిరిజన రైతులకు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంటలకు సుస్థిర వ్యవసాయ విధానాలు అమలు చేయాలని, ప్రకృతి వ్యవసాయంతోనే మన ఆరోగ్యం కాపాడుకోవాలని సంస్థ డైరెక్టర్ బి.సంజీవరావు సూచించారు. సర్పంచ్ బిడ్డిక నారాయణ, పెద్దదిమిలి వ్యవసాయ సహాయకురాలు పి.భవానీ, వీఏఏ వి.కమల పలు సూచనలు చేశారు. అనంతరం అజీమ్ ప్రేమ్‌జీ(ఏపీపీ) ఆర్థిక సహాయంతో ఉచిత కూరగాయల విత్తనాల ప్యాకెట్లను ఆదివాసీలకు అందజేశారు. సుస్థిర వ్యవసాయ ప్రోగ్రాం మాస్టర్ ట్రైనీ బి.అంబోజి, వెలుగు సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

కాలేజీల మంజూరుకు వసతుల పరిశీలన

రామభద్రపురం: మండలంలో కోఎడ్యుకేషన్ కాలేజీల మంజూరుకు ఎంఈఓలు తిరుమలప్రసాద్, పెంటయ్య బుధవారం రామభద్రపురం, ఆరికతోట ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. రామభద్రపురం ఉన్నత పాఠశాలను ప్రాధాన్యత-1, ఆరికతోట ఉన్నత పాఠశాలను ప్రాధాన్యత-2గా పరిశీలించి కళాశాలల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. ఆయా పాఠశాలల్లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు, కళాశాల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయా లేదా? తరగతి గదులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మరుగుదొడ్లు, ఆటస్థలం ఉందా లేదా అని పరిశిలించి ఆయా పాఠశాలల హెచ్ఎంలు కామేశ్వరరావు, ప్రసాద్‌రావులతో చర్చించారు. ప్రభుత్వం ప్రతీ మండలంలో రెండు పాఠశాలలను కళాశాలలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు.


ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాలి



విజేతలకు ప్రశంసాపత్రాలను అందించిన లీడ్‌బ్యాంక్ మేనేజర్ మూర్తి

పార్వతీపురం: ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవల్సిన ఆవశ్యకత విద్యార్థులకు ఉందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎస్.మూర్తి అన్నారు. జీ 20 ఈవెంట్‌లో భాగంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత ప్రేరణకు నిర్వహిస్తున్న మండల స్థాయి క్విజ్‌పోటీల విజేతలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఆర్థిక అక్షరాస్యత, క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. 13 మండలాల టీమ్‌లకు ఈ నెల 21న నిర్వహించిన మండలస్థాయి క్విజ్ పోటీల్లో కొమరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

జగన్నాథుడికి ప్రత్యేక పూజలు



నిజరూప దర్శనంలో జగన్నాథుడు



జగన్నాథస్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంపైకి తీసుకువెళ్తున్న అర్చకులు

వీరఘట్టం: జగన్నాథస్వామి మారు రథయాత్ర కనుల పండువగా సాగింది. ఈ యాత్ర మహోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్.శర్మయాజీ దంపతులు గుండిచా మందిరంలో ఉన్న జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు చేసి, ఊంజల సేవ చేశారు. అనంతరం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి ఉత్సవ విగ్రహాలను అర్చకులు లింగరాజ్ రథో రథంపైకి ఎక్కించారు. పట్టణ వీధుల్లో రథంపై కొలువుదీరిన జగన్నాథస్వామి ఊరేగింపుగా రావడంతో భక్తులు రథం వద్దకు వచ్చి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. విద్యుత్ సమస్య లేకుండా ట్రాన్స్‌కో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రథయాత్రకు పోటెత్తిన భక్తులు

పాలకొండ రూరల్ : జగన్నాథ రథయాత్రకు మండలంతో పాటు పట్టణానికి చెందిన భక్తులు పోటెత్తారు. బలరామ సుభద్రా సమేత జగన్నాథుడు బుధవారం నిజరూప దర్శనంతో భక్తులు పూజలందుకున్నారు. ఈ సందర్భంగా యాత్రలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మన్యంలో పెరిగిన నిమ్మ దిగుబడులు



మార్కెట్లో వ్యాపారులు కొనుగోలు చేసిన నిమ్మకాయలు

- కావిడ నిమ్మ రూ.400 నుంచి 500 వరకు విక్రయం
- కొండపోడులో సాగు చేస్తున్న రైతులు
- వారపు సంతల్లో విక్రయాలు

సీతంపేట: మన్యంలో ఈ ఏడాది నిమ్మ దిగుబడులు పెరిగాయి. ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి నిమ్మకాయలు గిరిజన రైతులు తెచ్చి విక్రయాలు చేస్తున్నారు. అంతగా పెట్టుబడులు అక్కర్లేక పోయినప్పటికి ఏజెన్సీలో సుమారు 5 వందల ఎకరాల వరకు పంటను కొండ పోడు వ్యవసాయంలో భాగంగా పండిస్తారు. సీతంపేట ఏజెన్సీలో ఈ సంవత్సరం అధికంగా దిగుబడులు వచ్చాయి. కావిడ నిమ్మ కాయలు అంటే 30 నుంచి 40 కిలోలు సరాసరి రూ.400 నుంచి రూ. 500 వరకు విక్రయిస్తున్నామని గిరిజనులు తెలిపారు. గతేడాది ఇదే సీజన్లో ఒక్కో కావిడి రూ. 600 వరకు విక్రయించేవారమని గిరిజనులు చెబుతున్నారు. ఒక్కో నిమ్మ పండు మైదాన ప్రాంతాల్లో రెండురూపాయిల వరకు విడిగా విక్రయిస్తారు. ఇక్కడ ఒక్కో పండు 50 పైసలకు సరాసరి కారుచౌకగా కొనుగోలు చేసిన వ్యాపారులు పట్టణాల్లో అధికంగా విక్రయించి లాభాలను ఆర్జిస్తారు.

మైదాన వ్యాపారులదే హవా..

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి నిమ్మ కాయలు కొనుగోలు చేస్తారు. సీతంపేటలో సోమవారం, మర్రిపాడులో బుధవారం, గురువారం దోనుబాయిలో కుశిమి, పొల్ల గ్రామాల్లో శనివారం వారపు సంతలు జరుగుతాయి. ఈ సంతలకు వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు. గిరిజన రైతులు చెప్పిన ధరలు కాకుండా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర నిర్ణయిస్తారు. దీంతో వారు చెప్పిన ధరలకు ఇవ్వాల్సి ఉంటుంది.

సేకరణ చాలా కష్టం

కొండలపై పండే ఈ పంటను సేకరించడం చాలా కష్టసాధ్యమైన పని. ఇంటిల్లపాది సేకరణకు వెళ్లే రోజుకు ఒక కావిడ వరకు మాత్రమే సేకరించగలం . అయితే ఆరుగాలం శ్రమించి పండించిన ఈ పంటకు మద్దతు ధరలు పెద్దగా ఉండడం లేదు.

– ఎస్.బాపన్న, అక్కన్నగూడ